


ఎల్ఐసి లక్ష్యాలను కొనసాగించాలి

ప్రజాశక్తి - కడప అర్బన్ : ఎల్ఐసి జాతీయకరణ లక్ష్యాలను కొనసాగించే చర్యలను కేంద్ర ప్రభుత్వం చేపట్టాలని, ఎల్ఐసి ఉద్యోగుల సంఘం కడప డివిజన్ అధ్యక్షులు అవధానం శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి ఎ.రఘునాథ రెడ్డి, శ్రామిక మహిళా కన్వీనర్ పి.వసుప్రద ఒక సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 19న ఎల్ఐసి జాతీయకరణ జరిగి 69 సంవత్సరాలు పూర్తవుతుందని తెలిపారు. 245 ప్రయివేట్ ఇన్సూరెన్స్ కంపెనీల మోసాల నుంచి ప్రజలను కాపాడేందుకే వాటి స్థానంలో ఒక ప్రభుత్వ రంగ సంస్థగా ఎల్ఐసిని ఏర్పాటు చేశారని పేర్కొన్నారు. ప్రభుత్వ రంగ ఎల్ఐసిని బలోపేతం చేయాల్సిన బాధ్యత కేంద్రంలోని ప్రభుత్వంపై ఉందని తెలిపారు. 69 ఏళ్లుగా ప్రజల సొమ్ము ప్రజా సంక్షేమానికి అనే నినాదంతో ఎల్ఐసి సంస్థ, దేశ ఆర్థిక వ్యవస్థలో రూ.51లక్షల కోట్లు పెట్టుబడులు పెట్టిందని, అనేకరంగా దేశ సర్వతో ముఖాభివృద్ధి కోసం ఆసరాగా పనిచేస్తోందని పేర్కొన్నారు. ఆరోగ్యం, బీమా ప్రతి భారతీయుడికి కనీస అవసరాలని హెల్త్, లైఫ్ ఇన్సూరెన్స్ ప్రీమియంలపై జిఎస్టి భారాన్ని పూర్తిగా తొలగించాలని తెలిపారు.



మాట్లాడుతున్న సిఎం చంద్రబాబు నాయుడు, హాజరైన ప్రజానీకం

రాజోలి జలాశయాన్ని పూర్తి చేస్తా

- ఎంఎస్ఎంఇ పార్కును తరలించబోం
- రూ.80 కోట్లతో గండికోటకు పర్యాటక శోభ
- స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్రను ఉద్యమంగా చేపట్టాలి
- రూ.90 కోట్లతో మైదుకూరుకు అమృత్ స్కీమ్
- మైదుకూరు పర్యటనలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వెల్లడి



ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ముఖ్యమంత్రి



పారిశుధ్య కార్మికురాలిని సన్మానిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు

ప్రజాశక్తి - కడప ప్రతినిధి/చాపాడు

రాజోలి జలాశయాన్ని పూర్తి చేసి 90 వేల ఎకరాలకు సాగు నీటిని అందిస్తామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పేర్కొన్నారు. శనివారం జిల్లాలోని మైదుకూరు పట్టణంలోని కెఎస్‌సి ఫంక్షన్ హాలులో ఎన్‌టిఆర్ 29వ వర్ధంతి సభ, జడ్‌పి ఉన్నత పాఠశాలలో నిర్వహించిన స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమ ప్రారంభోత్సవానికి హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని ఐదు కోట్ల మంది ప్రజానీకం స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని నినాదానికి పరిమితం చేయకుండా ఉద్యమరీతిలో ఉద్యమ రీతిలో ముందుకు సాగాలన్నారు. మెదడు, శరీరం, పని ప్రదేశాలు, ఇళ్లు, ఇంటి పరసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. విద్యా సంస్థల్లో ప్రతి మూడవ శనివారాన్ని స్వచ్ఛాంధ్ర కార్యక్రమానికి పరిమితం చేయాలని సూచించారు. మున్సిపాలిటీలో ఏడు కి.మీ సిసిరోడ్లు, మైదుకూరును మోడల్‌గా ఎంపిక, మురుగునీటిని శుద్ధి చేసి పంటలకు మళ్లించాలి. మైదుకూరును మోడల్ మున్సిపాలిటీగా తీర్చిదిద్దాలన్నారు. మైదుకూరులోని ప్రతింటికీ ట్యాప్ ఇవ్వాలి. ప్రతి ఇంటింటికీ గ్యాస్‌పైప్‌లైన్ వ్యవస్థ అమలు చేయాలన్నారు. రూ.90 కోట్లతో అమృత్ పథకం పనులు చేపడతామని చెప్పారు. రాయలసీ మలోని అనంతపురం జిల్లా ఎడారిగా మారబోతందనే హెచ్చరికల నేపథ్యంలో వందల కోట్ల రూపాయలతో హంద్రీనీవా, గాలేరు నగరి ప్రాజెక్టులను చేపట్టి, రాబోయే పెనుప్రమాదాన్ని నివారించామన్నారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో అభివృద్ధి-సంక్షేమం-సుపరి పాలన ఎజెండాతో సాగించిన ప్రచారాన్ని నమ్మి జిల్లా ప్రజానీకం ఉమ్మడి కడప జిల్లాలోని 10 అసెంబ్లీ స్థానాలకు ఎనిమిదింటిని కూటమి పార్టీలకు కట్టబెట్టారన్నారు. కడప పార్లమెంట్ స్థానాన్ని సైతం స్వల్ప మెజార్టీతో కోల్పోయామని, మరింత శ్రమించి ఉంటే దక్కిం చుకునే అవకాశం ఉండేదన్నారు. కొప్పర్తి పారిశ్రామిక వాడలోని ఎంఎస్‌ఎంఇ తరలించ బోమని, ఎపిజిబి ప్రధాన కార్యాల యాన్ని సైతం కేంద్రంతో సంప్ర దించిన అనంతరం సానుకూల నిర్ణయం తీసుకు ంటామని తెలిపారు. కేంద్రం కొప్పర్తి పారిశ్రామికవాడకు రూ.2,300 కోట్లు ఇచ్చిందని, దీంతో సమీపంలో పెద్దఎత్తున ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. కడప జిల్లాలో ఉక్కు పరిశ్రమ వస్తే జిల్లా ప్రగతి పరుగులు పెడుతుందన్నారు. గండికోట పర్యాటక ప్రాజెక్టు అభివృద్ధి పరచడం ద్వారా టూరిస్ట్ హబ్‌గామారి ఉపాధి అవకాశాలు కల్పిస్తుందని తెలిపారు. దేశంలో సంక్షేమ పథకాలకు ఎన్టీఆర్ ఆదర్శనీ యుడని కొనియాడారు. రూ.2 కిలోబియ్యం, జనతా వస్త్రాలు, పక్కాఇళ్లు, మహిళలకు ఆస్తిహక్కు, బిసిలకు రాజకీయ, ఆర్థిక, సామాజిక అవకాశాలను కల్పించిన ఘనత ఎన్టీఆర్‌కే దక్కుతుందని తెలిపారు. మైదుకూరుకు బిసి ఎమ్మెల్యే ప్రాతినిధ్యం వహిస్తున్నాడని తెలిపారు. కాంగ్రెస్ హయాంలో సాగునీటి ప్రాజెక్టులు చేపట్టిన దాఖలాల్లేవన్నారు. ఎన్టీఆర్ రాకతో దోపిడీ రాజకీయాలకు తెర పడిందని చెప్పారు. రాజకీయాల్లోకి విద్యావంతులను తెచ్చిన ఘనత వహించారని తెలిపారు. పేదరికం లేని సమాజం టిడిపితోనే సాధ్యమన్నారు. రాయలసీమ జిల్లాల ఆదాయాలను అంచనా వేస్తే భవిష్యత్‌లో కడప, అనంతపురం అధిక ఆదాయ జిల్లాలుగా నిలవనున్నట్లు తేలిందన్నారు. కరువు పీడిత జిల్లాలను అభివృద్ధి చేసే బాధ్యత తీసుకుంటానని తెలిపారు. ఇంటికో పారిశ్రామికవేత్తలు తయారు కావాలన్నారు. ప్రతిఒక్కరూ కీ.శే ఎన్‌టిఆర్ ఆదర్శాలకు పునరంకితం కావాలన్నారు. ప్రొద్దు టూరులో నందం సుబ్బయ్య హత్య నేపథ్యంలో ఆయన చూపిన తెగువను స్మరణకు తెచ్చుకోవాలన్నారు. రాష్ట్రాన్ని స్వర్ణాంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దాలని చెప్పారు. అనంతరం టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు మాట్లాడుతూ రాష్ట్రమంత్రి నారా లోకేష్‌ను డిప్యూటీ సిఎంను చేయాలని విజ్ఞప్తి చేశారు. తర్వాత మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ మాట్లాడుతూ మైదుకూరులో 100 పడకల ఆస్పత్రికి స్థలం కొరత కారణంగా భవన నిర్మాణ పనులకు టెండర్లు పిలవడం లేదని, స్థలాన్ని కేటాయించేలా చూడాలని విజ్ఞప్తి చేశారు.రూ.50 కోట్లతో రోడ్లు, రూ.50 కోట్లతో డ్రెయినేజీ పనులకు కేటాయించాలని కోరారు. ఉర్దూ కళాశాల, మార్కెటింగ్ కోల్డ్ స్టోరేజీ, పాలిటెక్నికల్ కళాశాలల భవన నిర్మాణ సదుపాయాలను మంజూరు చేయాలన్నారు. టిజిపి నుంచి తాగునీటి పథకం, రైతు బజార్, డిగ్రీ కళాశాల భవనం, చేనేతలకు వృత్తి పనులు కల్పించాలని, మినీస్టేడియం మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. దీనికి సిఎం చంద్రబాబు నాయుడు స్పందించి రాబోలి జలాశయాన్ని పూర్తి చేస్తామని హామీనిచ్చిరు. అనంతరం కడపకు చెందిన అలైక్య చెత్త వ్యర్థాల నుంచి పంటలు పండించిన అలైక్య, మున్సిపల్ కార్మికులు అములమ్మ, గంగాధర్, అనకాపల్లి పంచాయతీ కార్యదర్శి శ్రీనాథ్‌ల్ని రూ.లక్ష నగదుతోపాటు సన్మానం చేశారు. మైదుకూరు పట్టణం వినాయకనగర్‌కు చెందిన వందన అనే గృహిణిని సన్మానించారు. అనంతరం జర్నలిస్టు ఫోరం నాయకులు జర్నలిస్టుల సమస్యలపై వినతిపత్రం అందజేశారు. అనంతరం జర్నలిస్టు ఫోరం సభ్యులు జర్నలిస్టులకు ఇళ్లు, ఇళ్లస్థలాలు, అక్రిడిటేషన్లు, కరోనా మృతులకు పరిహారం, ప్రమాదబీమా, రిటైర్డు జర్నలిస్టులకు పింఛన్ సదు పాయం వంటి సమస్యలపై వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి సవితా, రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, ఎమ్మెల్యేలు వరదరాజులరెడ్డి, మాధవి, పుత్తా చైతన్యరెడ్డి, సి.ఆది నారాయణరెడ్డి, ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి, టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు ఆర్.శ్రీనివాసులరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ బి.టెక్ రవి, మాజీ ఎమ్మెల్యేలు లింగారెడ్డి, విజయమ్మ, టిడిపి నాయకులు హరిప్రసాద్, గోవర్ధన్‌రెడ్డి, ప్రవీణ్, రితీష్, జగన్, పెద్దఎత్తున కార్యకర్తలు పాల్గొన్నారు.



స్వచ్ఛ ఆంధ్ర ర్యాలీలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు

ప్రభుత్వ విద్యా రంగ పరిరక్షణకు తోడ్పడండి

ఆర్‌జెడికి యుటిఎఫ్ వినతి

ప్రజాశక్తి-కడప అర్బన్

ప్రభుత్వ విద్యారంగ బలోపేతానికి, పరిరక్షణకు పాటుపడాలని పాఠశాల విద్య ఆర్‌జెడి కె.శామ్యూల్‌కు యుటిఎఫ్ కడప జిల్లా శాఖ విజ్ఞప్తి చేసింది. పాఠశాల విద్య కడప రీజనల్ జాయింట్ డైరెక్టర్ గా పదోన్నతి పొంది బాధ్యతలు చేపట్టిన కె.శామ్యూల్‌ను శనివారం ఆర్‌జెడి కార్యాలయంలో యుటిఎఫ్ నాయకులు కలిసి అభినం దనలు తెలియజేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యదర్శి బి.లక్ష్మీరాజా, కడప జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాదన విజయ కుమార్, పాలెం మహేష్‌బాబు, అన్నమయ్య జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి.హరి ప్రసాద్, ఎస్.జాబీర్ పాఠశాల విద్య నూతన ఆర్‌జెడి కె.శామ్యూల్‌తో మాట్లాడుతూ పాలకులు విద్యారంగంలో ప్రవేశపెట్టిన సంస్కరణల వల్ల ప్రభుత్వ విద్యా రంగం అనేక సవాళ్లను ఎదుర్కొం టుందని తెలిపారు. ప్రత్యేకించి ప్రాథమిక విద్యారంగం సంక్షోభంలో కొట్టు మిట్టాడుతున్నదని పేర్కొన్నారు. పాలకులు ప్రవేశపెట్టిన సంస్కరణలు ప్రయివేటు, కార్పొరేటు శక్తులకు ఊతమిచ్చినట్లుగా ఉన్నాయని తెలిపారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వ విద్యా రంగ అభివృద్ధిని కాంక్షించే వ్యక్తిగా ఆర్జేడి బాధ్యతలు చేపట్టిన ప్రభుత్వ విద్యా రంగ పరిరక్షణకు పూర్తిస్థాయిలో కృషి చేయాలని కోరారు. గత కొంత కాలంగా విద్యా క్షేత్రంలో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు, అధికారులకు సమన్వయం కొరవడిందని పేర్కొన్నారు. ప్రభుత్వ విద్యా రంగం మెరుగైన ఫలి తాలను సాధించలే కపోతున్నదని చెప్పారు, అధికారులు పాఠశాలల సందర్శన సందర్భంగా గుర్తించే చిన్న చిన్న లోపాలను స్నేహ పూరిత వాతావరణంలో సరిదిద్దుకునే విధంగా ఉపాధ్యాయులతో చర్చించడం లేదని, చిన్న చిన్న కారణాలకు దూషించడం, మెమోలు, షోకాజు నోటీసులు జారీ చేయడం లాంటి విధానాలకు పాల్పడుతున్నారన్నారు. వీటివల్ల ఉపాధ్యాయులు ఒత్తిడిలకు లోనవు తున్నారని పేర్కొన్నారు. నూతన ఆర్‌జెడిగా అధికారులకు, ఉపాధ్యాయులకు సమన్వ యం పెరిగేందుకు, తద్వారా విద్యా క్షేత్రంలో మెరుగైన ఫలితాలను సాధిం చేందుకు కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఆర్‌జెడి మాట్లాడుతూ ప్రభుత్వ విద్యా రంగ పరిరక్షణకు పాటుపడేందుకు తాను ఎల్లవేళలా కృషి చేస్తానని, పాఠశాలల్లోని చిన్న చిన్న సమస్యలను స్నేహపూరిత వాతావరణంలో పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలిపారు. అధికారులు, ఉపాధ్యాయులు సమన్వయంతో పని చేస్తేనే ప్రభుత్వ విద్యా రంగం అభివృద్ధి చెందుతుందని, ప్రభుత్వ పాఠశాలల మీద నమ్మకంతో వచ్చే పేద, బడుగు, బలహీన వర్గాల విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందని చెప్పారు. ప్రభుత్వ విద్యారంగ బలోపేతానికి ఉపాధ్యాయ సంఘాల సూచనలను కూడా తీసుకుంటానని, జిల్లాలో విద్యారంగాన్ని అగ్రస్థానంలో నిలిపేందుకు సమిష్టిగా కృషి చేద్దామని పేర్కొన్నారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా ట్రెజరర్ కె.నరసింహారావు, జిల్లా కార్యదర్శులు సి.వి.రమణ, ఎస్.ఎజాస్ అహ్మద్, ఆడిట్ కమిటీ కన్వీనర్ ఎం.ప్రభాకర్, జిల్లా కార్యవర్గ సభ్యులు దిలీప్ చక్రవర్తి, అనిల్ కుమార్ పాల్గొన్నారు.



ఆర్‌జెడికి పూలబొకే అందజేస్తున్న యుటిఎఫ్ నాయకులు

రెడ్డి సేవాసమితి సేవలు ప్రశంసనీయం

- రిటైర్డ్ న్యాయమూర్తి జస్టిస్ సి.వి.నాగార్జునరెడ్డి

ప్రజాశక్తి- కడప అర్బన్

పలు రంగాల్లో గొప్ప సేవలందిస్తున్న రెడ్డి సేవాసమితి సంస్థ నిర్వహణ ప్రశంసనీయమని ఎపి విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్.సి.వి. నాగార్జున రెడ్డి అన్నారు. శనివారం డిఎస్‌ఆర్ కల్యాణ మండపంలో రెడ్డి సేవాసమితి ఆధ్వర్యంలో రజతోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రోలయవేమారెడ్డి మొదలుకుని నేటివరకు అనేకమంది రెడ్లు దేశానికి అనేక రంగాల్లో సేవలందించారన్నారు. తొలి ముఖ్యమంత్రి నీలం సంజీవరెడ్డి మొదలుకుని తెలుగునేలపై 11 మంది రెడ్లు ముఖ్యమంత్రులుగా సేవలందించారన్నారు. అనంతరం మేలుకొలుపు పుస్తకాన్ని, ప్రముఖ రచయిత పుత్తా పుల్లారెడ్డి రచించిన 'మహాభారత విజ్ఞాన సర్వస్వం'(4 సంపుటాలు) పుస్తకాన్ని ఆవిష్కరించారు. పుల్లారెడ్డికి 'సాహిత్య రత్నాకర' బిరుదు ప్రదానం చేశారు. కార్యక్రమంలో రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి, రెడ్డి సేవా సమితి అధ్యక్షులు ఆచార్య కుప్పిరెడ్డి నాగిరెడ్డి, ప్రధాన కార్యదర్శి లెక్కల కొండారెడ్డి, ఎమ్మెల్సీ ఎం.వి. రామ చంద్రారెడ్డి, వైవీయూ సహ ఆచార్యులు కొవ్వూరు రామసుబ్బారెడ్డి, హంస అవార్డు గ్రహీత డా.నరాల రామారెడ్డి, ఉస్మానియా విశ్వ విద్యాలయం విశ్రాంత ఆచార్యులు కసిరెడ్డి వెంకటరెడ్డి, ప్రముఖ జానపద పరిశోధకులు ఆచార్య చిగిచెర్ల కృష్ణారెడ్డి, కొండా లక్ష్మీకాంత రెడ్డి, యలమర్తి మధుసూదన్, డాక్టర్ భూతపురి గోపాలకృష్ణశాస్త్రి, డాక్టర్ చింతకుంట శివారెడ్డి, డాక్టర్ వెల్లాల వెంకటేశ్వరాచారి, డాక్టర్ అనుగూరు చంద్రశేఖరరెడ్డి, కొండూరు జనార్ధనరాజు, ప్రముఖులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నాగార్జునరెడ్డి

వైద్యం వికటించి మహిళ మృతి

- ప్రయివేట్ ఆస్పత్రి వద్ద కుటుంబ సభ్యుల ఆందోళన

ప్రజాశక్తి-ప్రొద్దుటూరు

ఆరోగ్యం మెరుగుపరుచుకునేందుకు ఓ మహిళ ఆసుపత్రిలో చేరగా వైద్యులు చేసిన వైద్యం వికటించి మృతి చెందిన సంఘటన ప్రొద్దుటూరులో శనివారం చోటు చేసుకుంది. వివరాలు.. యర్రగుంట్ల మండలం తుమ్మలపల్లెకు చెందిన వడ్డారపు రమాదేవి (35) కడుపునొప్పితో బాధ పడుతూ చికిత్స కోసమని స్థానిక కెవిఆర్ ఆసుపత్రిలో శుక్రవారం చేరారు. వైద్యులు పరీక్షించి అపెండిక్స్ సమస్య ఉందని ఆపరేషన్ చేయాలని సూచించారు. ఆపరేషన్ చేశారు. అనంతరం శనివారం రమాదేవి మృతి చెందారు. మృతురాలికి భర్త ముగ్గురు పిల్లలున్నారు. మృతి చెందిన విషయాన్ని వైద్యులు గోప్యంగా ఉంచారు. విషయం తెలసుకున్న కుటుంబం సభ్యులు ఆ స్పత్రికి సిబ్బందిపై ఆగ్రహించి ఆందోళనకు దిగారు. ఆసుపత్రి సమీపంలో ధర్నా చేయడంతో ట్రాఫిక్ సమస్య ఏర్పడింది. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ఆందోళన కారులను సర్ది చెప్పి పరిస్థితి అదుపులోకి తెచ్చారు.



ఆందోళన కారులకు సర్ది చెబుతున్న పోలీసులు

జిల్లా మహాసభను జయప్రదం చేయండి

ప్రజాశక్తి - కడప అర్బన్

ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్లు ఎదురుచూస్తున్న డిమాండ్ల సాధనకు ఈ నెల 19న నిర్వహించే ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా మహాసభ జయప్రదం చేయాలని రాష్ట్ర కార్యదర్శి రఘురామ నాయుడు పిలుపునిచ్చారు. శనివారం సంఘం కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహాసభకు ఎపిజిఇఎ రాష్ట్ర అధ్యక్షులు కె.ఆర్. సూర్యనారాయణ హాజరవుతారని తెలిపారు. జడ్‌పి సమావేశ మందిరంలో ఉదయం 10 గంటలకు సభ ప్రారంభం అవుతుందని చెప్పారు. అన్ని శాఖల ప్రభుత్వ ఉద్యోగులు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి సుదర్శన్ రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని సిఎంకు వినతి

ప్రజాశక్తి - కడప అర్బన్

జిల్లాలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని, విద్యా శాఖ మంత్రి నారా లోకేష్‌కు డిప్యూటీ సీఎం పదవి ఇవ్వాలని టిడిపి పార్లమెంట్ అధికార ప్రతినిధి మన్నూరు అక్బర్ కోరారు. శనివారం జిల్లా పర్యటనకు వచ్చిన సిఎం చంద్రబాబు నాయుడుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లోకేష్‌కు డిప్యూటీ సిఎం పదవి ఇవ్వాలని చాలామంది కోరుకుంటున్నారని తెలిపారు. రాయలసీమ ప్రాంతానికి ఇన్‌ఛార్జిగా కొనసాగించాలని విజ్ఞప్తి చేశారు. నిజాయితీగా పనిచేస్తున్న ద్వితీయ శ్రేణి నాయకులను, ప్రథమ శ్రేణి నాయకులుగా గుర్తించాలని కోరారు. షాది ఖానాలను, శ్మశాన వాటికలను ఆధునీకరించాలని పేర్కొన్నారు. ఇమాము, మౌజన్‌లకు గౌరవ వేతనం విడుదల చేయాలన్నారు. కడపలో ఉన్న హజ్ హౌస్‌ను వినియోగంలోనికి తీసుకురావాలని కోరారు.

డ్రాఫ్ట్ రూల్స్‌లోని అసంబద్ధాలను తొలగించాలి

ప్రజాశక్తి - కడప అర్బన్

బదిలీలు, రేషనలైజేషన్ చట్టబద్ధత, డ్రాఫ్ట్ రూల్స్‌లోని అసంబద్ధాలను తొలగించాలని, లేనిపక్షంలో వేలాదిగా స్కూల్ అసిస్టెంట్ పోస్టులు సర్ ప్లస్ అవుతాయని, డ్రాఫ్ట్ రూల్స్ సవరించాలని శనివారం ఆర్‌జెడి శామ్యూల్‌కు ప్రగతిశీల రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం నాయకులు విన్నవించారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అధ్యక్షులు లెక్కల జమాల్ రెడ్డి, రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి ఇలియాస్‌రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షులు రామాంజనేయరెడ్డి, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.వి. సుబ్బారెడ్డి, ఎన్వి సుబ్బారెడ్డి, సిపిఎస్ కన్వీనర్ నారాయణరెడ్డి, జిల్లా బాధ్యులు మోహన్ రెడ్డి, దిలీప్ కుమార్, నాయమూర్ రెహమాన్ కోరారు.



ఆభరణాలు ప్రదర్శిస్తున్న మహిళలు

మలబార్‌లో వెండి ఆభరణాల ప్రదర్శన

ప్రజాశక్తి - కడప అర్బన్

మలబార్ గోల్డ్, డైమండ్స్ కడప షోరూంలో శనివారం వెండి ఆభరణాల ప్రదర్శన షోరూమ్ హెడ్ లెసన్ సత్యన్, మార్కెటింగ్ ఇన్‌ఛార్జి ఇషాక్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ ప్రదర్శనలో భాగంగా వెండి సామగ్రి, పట్టీలపై 25శాతం వరకు తగ్గింపు, వెండి ఆభరణాల ఎంఆర్‌పి విలువ పై 10శాతం వరకు తగ్గింపు పొందాలని చెప్పారు. ఈ ప్రదర్శన కేవలం మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ కడప షోరూంలో ఈనెల 18 నుంచి 27 వరకు ఉంటుందని పేర్కొన్నారు. మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ నిబద్ధతలో భాగంగా, తమ వినియోగదారులకు 11 న్యాయమైన వాగ్దానాలను అందిస్తుందని తెలిపారు. ప్రజల సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పేదల ఇళ్లను టార్గెట్ చేయడం సరికాదు

ప్రజాశక్తి - కడప : 1వ వార్డు పాత కడపలో పేద, బడుగు, బలహీన వర్గాల ఇళ్లను విద్యుత్ అధికారులు టార్గెట్ చేయడం సరైంది కాదని కాంగ్రెస్ పార్టీ ఎన్‌ఎస్‌యుఐ జిల్లా అధ్యక్షులు మామిళ్ళ బాబు అన్నారు. పేదలకు కొంత సమయం ఇవ్వాలని డిమాండ్ చేశారు. శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కడపలో పేదల ఇళ్లను కరెంట్ బిల్లులు కట్టమని భయ భ్రాంతు లకు విద్యుత్ అధికారులు గురి చేస్తున్నారని అన్నారు. పెండింగ్ లో ఉన్న కరెంటు బిల్లులు అన్నీ ఒక్కసారి కట్టమని డిమాండ్ చేయడం సరికాదన్నారు. గతంలో కాంగ్రెస్ పార్టీ, వైసిపి అధికారంలో ఉన్నప్పుడు ఏ ఒక్క అధికారీ ఇళ్లకు రాలేదని, ప్రస్తుత ప్రభుత్వం పేద ఇళ్లను టార్గెట్ చేస్తున్నారు అన్నారు. నెల నెల వచ్చి కరెంట్ బిల్లులు ఇచ్చి ఉండి ఉంటే పేద లు కట్టేవారు అని అన్నారు. గడిచిన ఐదేళ్లల్లో రాని అధికారులు, ఇప్పుడు పేదలను ఇబ్బంది పెట్టడం మంచిది కాదు అని అన్నారు. పేదల జోలికి వచ్చిన ప్రభు త్వాలు ఏవి కూడా ఇంతవరకు నిలబడకుండా పోయాయని అన్నారు. త్వరలో కార్పొరేషన్ ఎన్నికలు రాబోతున్నాయని, టిడిపికి పేదలు తగు గుణపాఠం చెప్పి ఓడిస్తారని అన్నారు.

వాస్తవాలు తెలుసుకుని మాట్లాడాలి : డిసిసి

ప్రజాశక్తి - కడప

రాహుల్ గాంధీ గురించి వాస్తవాలు తెలుసుకొని పురందేశ్వరి, లంకా దినకర్ మాట్లాడాలని కాంగ్రెస్ పార్టీ కడప జిల్లా అధ్యక్షురాలు ఎన్.డి. విజయ జ్యోతి అన్నారు. శనివారం కాంగ్రెస్ పార్టీ కడప జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఇటీవల ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్ మోహన్ భగవత్ అయోధ్య రామమందిరంలో విగ్రహ ప్రతిష్ఠాపన రోజునే భారత్ నిజమైన స్వాతంత్ర్యాన్ని పొందిందని వ్యాఖ్యానించారు అన్నారు. ఈనెల 15న ఢిల్లీలోని కాంగ్రెస్ పార్టీ జాతీయ ప్రధాన కార్యాలయం ప్రారంభోత్సవంలో రాహుల్ గాంధీ స్పందిస్తూ భగవత్ వ్యాఖ్యలు దేశద్రోహం కిందకు వస్తాయని చెప్పారని పేర్కొన్నారు. భగవత్ వ్యాఖ్యలు ప్రజలను అవమానించేలా ఉన్నాయని అన్నారని ఆమె తెలిపారు. ఇలాంటి పిచ్చి మాటలు ఆపాలని రాహుల్ గాంధీ హితవు పలికారని చెప్పారు. పై అంశం మీద ఆంధ్రప్రదేశ్ భారతీయ జనతా పార్టీ అధ్యక్షులు దగ్గుబాటి పురందేశ్వరి, ఆంధ్రప్రదేశ్ 20 సూత్రాల చైర్మన్ బిజెపి ఆంధ్ర ప్రదేశ్ ప్రధాన అధికార ప్రతినిధి లంకా దినకర్ రాహుల్ గాంధీపై చేసిన వ్యాఖ్యలు సరైందని కాదన్నారు. పురం దేశ్వరి అంబేద్కర్‌ను అవమానించారని వాపోయా రు. విలేకరుల సమావేశంలో కడప అసెంబ్లీ కో- ఆర్డినేటర్ బండి జకరయ్య, యువజన కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు మూరతోటి విజయ్ కుమార్, కుల్లాయప్ప, హరి ప్రసాద్, మైనుద్దీన్ పాల్గొన్నారు.



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న విజయజ్యోతి

దౌర్జన్యకాండ!

ప్రజాదృష్టి

ఇసుక టెండర్ల వ్యవహారం వివాదాస్పదం కావడం విచారకరం. జిల్లాలో సాధారణంగా 13 నుంచి 16 ఇసుక రీచ్‌లు ఉన్నట్లు అంచనా. వేసవి సీజన్ కావడం, నదులు అడుగంటిన నేపథ్యంలో మరో మూడు రీచ్‌లకు మైనింగ్ జిల్లా అధికార యంత్రాంగం టెండర్లు పిలిచింది. నెల రోజుల కిందట తంగేడుపల్లి ఇసుకరీచ్‌కు టెండరు పిలిచింది. శుక్రవారం పులివెందుల నియోజకవర్గం చక్రాయపేట మండల పరిధిలోని గండికొవ్వూరు, రాజంపేట నియోజకవర్గం సిద్ధవటం మండల పరిధిలోని గుండ్లామూల ఇసుక రీచ్‌లకు జిల్లా మైనింగ్ యంత్రాంగం టెండర్లు పిలిచింది. గండికొవ్వూరు ఇసుక రీచ్‌కు పులివెందులకు చెందిన అధికార టిడిపి నేతల అనుచరులు పరస్పరం తీవ్రంగా పోటీ పడడంతో వ్యవహారం రచ్చకెక్కింది. ఇసుకను మార్కెట్ సరుకుగా మార్చడం దగ్గర నుంచి దాని నిర్వహణ దగ్గర వరకు ప్రభుత్వం స్వార్థపరత్వమే కారణమని తెలుస్తోంది. ఆర్‌డబ్ల్యుఎస్ టెండర్ల దగ్గర నుంచి ఇరిగేషన్ కాంట్రాక్టులు ఇటీవలి ఎక్సైజ్ విభాగం వరకు టెండర్లను ఆన్‌లైన్‌లో వేసుకుని అవకాశాన్ని కల్పించడం తెలిసిందే. మైనింగ్ టెండర్లను సైతం ఆన్‌లైన్ సదుపాయాన్ని కల్పించి ఉంటే ఇటువంటి దౌర్జన్యకాండకు అవకాశం లేకుండా పోయేది. ప్రభుత్వ ఉద్దేశపూర్వక తప్పిదమే కారణమనే వాదన వినిపిస్తోంది. ఇప్పటికైనా ప్రభుత్వం టెండర్లను ఆన్‌లైన్ ద్వారా నిర్వహించాల్సి ఉంటుంది. పాలనలో పారదర్శకత లభించడంతో పాటు జిల్లా అధికార యంత్రాంగానికి, సామాన్య ప్రజానీకానికి ఉపశమనం లభించే అవకాశం ఉంటుందని గ్రహించాల్సిన అవసరం ఎంతైనా ఉందని చెప్పవచ్చు. పులి వెందుల నియోజకవర్గ పరిధిలోని వేంపల్లి, వేముల, పులివెందుల, లింగాల తదితర మండలాలకు చెందిన పలుగ్రామాల్లో రూ.కోట్లాది బెట్టింగ్‌తో కూడిన కోడి పందేలు జోరుగా సాగడం ఆందోళనకరం. పోలీస్ యంత్రాంగం సంక్రాంతి పర్వదినానికి ముందు నుంచే కోడిపందేలు చట్టరీత్యా నేరమని ప్రచారం చేయడం వరకు బాగానే ఉంది. వాస్తవంలో కోడిపందేలు సాగిన మండలాలకు చెందిన పోలీస్ అధికారులపై ఎటువంటి చర్యలు లేకపోవడంతో పోలీసుల ప్రచారం ఉత్తిదేనని తేలిపోయింది. మూగజీవాల మధ్య బెట్టింగులతో కూడిన పందేలు పెట్టి చలిమంట కాచుకోవడం రాక్షసత్వం. ఇటువంటి రాక్షసత్వానికి ఒడిగట్టిన అసాంఘిక శక్తుల్ని అటుంచితే అందుకు పరోక్షంగా సహకరించిన బాధ్యత వహించిన సంబంధిత అధికారులపై తక్షణమే చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. లేని పక్షంలో సామాన్యులను అటుంచితే అసాంఘిక, సంఘవిద్రోహ శక్తులకు పోలీసులన్నా, చట్టాలన్నా ప్రజలకు చులకనభావం ఏర్పడ డంతో పాటు గౌరవం, భయం పోయే అవకాశాలు ఉన్నాయని చెప్పవచ్చు.

- ప్రజాశక్తి - కడప ప్రతినిధి

లాభాల బాటలో బీర సాగు

ప్రజాశక్తి - చాపాడు

మండల పరిధిలో సాగుచేసిన బీర పంట లాభాలనిస్తోందని రైతులు పేర్కొంటున్నారు. మండల పరిధిలోని సీతారామపురం, రాజుపాలెం, తిప్పిరెడ్డిపల్లె, జడ్జీగారి కొట్టాలు వద్ద బీర పంటను సాగు చేశారు. ఎకరా కోతకు రెండు టన్నుల వరకు దిగుబడి వస్తోంది. మూడు నాలుగు రోజులకు ఒకసారి దిగుబడి వస్తుంది. కిలో రూ.30 ప్రకారం ప్రొద్దుటూరు, హైదరాబాదు, నెల్లూరు, తిరుపతి వంటి ప్రాంతాలకు ఎగుమతి చేపడుతున్నారు. వ్యాపారులే పంటపొలాల వద్దకు వచ్చి కొనుగోలు చేసి తీసుకెళున్నారు. రైతులే పంటను తరలిస్తే మరో రెండు రూపాయలు అదనంగా చెల్లిస్తున్నట్లు చెబుతున్నారు. ఎకర సాగుకు రూ.50వేల వరకు ఖర్చులు అవుతున్నాయని రైతులు పేర్కొంటున్నారు. ఆ తర్వాత ఎరువులు, పురుగు మందులు వినియోగాన్ని బట్టి మరింత ఖర్చులు వస్తాయన్నారు. కర్రలపైన బీర సాగు చేపట్టడం వలన కాయలు పొడవుగా ఏర్పడి మంచి దిగుబడి వస్తుందని రైతులు పేర్కొంటున్నారు. సీతారామాపురం గ్రామ పరిధిలో 10 ఎకరాలు మండల పరిధిలో వివిధ గ్రామాల్లో 30 ఎకరాల్లో సాగు చేపట్టారు. అట్టపెట్టెలలో బీరకాయలను పేర్చి ఇతర ప్రాంతాలకు రవాణా చేస్తున్నారు. వరి పంట సాగు అనంతరం కూరగాయలు సాగు చేపట్టడంతో మంచి ఫలితాలు వస్తున్నాయని రైతులు పేర్కొంటున్నారు.


తరలించేందుకు సిద్ధంగా ఉంచిన బీర కాయలు, కర్రలపై సాగు చేసిన బీర

తెలుగు ప్రజల గుండెచప్పుడు ఎన్‌టిఆర్


ఎన్‌టిఆర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

ప్రజాశక్తి - కడప అర్బన్

యుగపురుషుడు, విశ్వవిఖ్యాత నటసార్వభౌముడు, మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు 29వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి 26వ డివిజన్‌లో టిడిపి ఎన్నారై కువైట్ ఉపాధ్యక్షులు షేక్. రహమతుల్లా ఆధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో టిఎన్‌ఎస్‌ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మసాపేట శివ, 4వ డివిజన్ యూనిట్ ఇన్‌ఛార్జి ఆవుల వెంకటేష్, రాఘవేంద్ర, విశ్వనాథ్,ఆనంద్, రాజశేఖర్, వీర్రాయ్య, శేఖర్ పాల్గొన్నారు.

ఎన్‌టిఆర్ సర్కిల్, చిన్నచౌక్ వద్దనున్న ఎన్‌టిఆర్ విగ్రహాలకు ప్రభుత్వ విప్ మాధవి, టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్లు, నాయకులు, కార్యకర్తలు, ఎన్టీఆర్ అభిమానులు పాల్గొన్నారు.

కమలాపురం టౌన్ : టిడిపి కార్యాలయంలో నందమూరి తారక రామారావు వర్ధంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి ఎమ్మెల్యే పుత్తా కృష్ణ చైతన్య పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ రాఘవరెడ్డి ఖాదర్ బాషా, జంపాల నరసింహారెడ్డి, చాపాటి ప్రభాకర్ రెడ్డి , జంపాల నరసింహారెడ్డి, గంగవరం ప్రసాద్ రెడ్డి, సూర్య హై స్కూల్ సుబ్బారెడ్డి, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


ఎన్‌టిఆర్‌కు నివాళులర్పిస్తున్న భూపేష్, మాజీ ఎమ్మెల్సీ

జమ్మలమడుగు రూరల్ : జమ్మలమడుగు టిడిపి కార్యాలయంలో నందమూరి తారక రామారావు వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ముందుగా నియోజవర్గం టిడిపి ఇన్‌ఛార్జి చదిపిరాళ్ల భూపేష్ సుబ్బరామిరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ దేవగుడి నారాయణరెడ్డి ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి జంబాపురం రమణారెడ్డి, యూత్ నాగేశ్వరరెడ్డి, పాలూరు సుధీర్, మోరగుడి విశ్వనాథరెడ్డి, జింకల బాషా, అంబవరం రామయ్య, గూడెంచెరువు బాలు, శివారెడ్డి, ఐఎల్ చిన్న, నవీన్, పార్టీ అనుబంధ కమిటీ సభ్యులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

సింహాద్రిపురం : తెలుగు ప్రజల గుండెచప్పుడు దివంగత నందమూరి తారక రామారావు అని టిడిపి నాయకులు ప్రకాష్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని బిదినంచర్లలో మాజీ సిఎం ఎన్‌టిఆర్ వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వేంపల్లె : తెలుగు చలనచిత్ర రంగం, రాజకీయ రంగంలో నందమూరి తారక రామారావు ఒక ధృవతార అని టిడిపి మండల కన్వీనర్ రామ మునిరెడ్డి, ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ మహమ్మద్ షబ్బీర్ తెలిపారు. ఎన్‌టిఆర్ వర్ధంతి సందర్భంగా స్థానిక టిడిపి కార్యాల యంలో మహమ్మద్ షబ్బీర్, రామ మునిరెడ్డి ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. ఎన్టీఆర్ చిత్ర పటానికి టిడిపి నేతలతో కలిసి ఘనంగా నివాళులర్పించారు. పిసిసి అధికార ప్రతినిధి తులసిరెడ్డి, ఆయన సతీమణి అలివేలమ్మ తమ ఇంట్లో ఎన్‌టిఆర్‌కు ఘనంగా నివాళులర్పించారు. గండి రోడ్డులో టిడిపి ఎస్సీ సెల్ నేత యుగంధర్ ఆధ్వర్యంలో నివాళులర్పించారు. అమ్మ అనాథ వృద్ధుల శరణాలయంలో పండ్లు, బ్రెడ్ టిడిపి నేతలు షరీఫ్, మాబు, డాక్టర్ కరీముల్లా, శివ, ఫయాజ్, లాడెన్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో బాలస్వామిరెడ్డి, జగన్నాథరెడ్డి, పీరా సాహెబ్, రామగంగిరెడ్డి పాల్గొన్నారు.


అనాథ వృద్ధులకు పండ్లు, బ్రెడ్ అందజేస్తున్న నేతలు


ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాలు వేసి నివాళులర్పిస్తున్న ఉమాదేవి

పులివెందుల రూరల్ : పులివెందుల టిడిపి కార్యాలయంలో ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి బీటెక్ రవి ఎన్‌టిఆర్ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. పలువురు టిడిపి నాయకులు పాల్గొన్నారు. ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి సతీమణి ఉమాదేవి తన నివాసంలో ఉన్న ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు.

పెద్దముడియం : దివంగత ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు వర్ధంతి సందర్భంగా ఆయనకు కొండ సుంకేసుల గ్రామ కూటమి నాయకులు ఘనంగా నివాళులర్పించారు. కొండ సుంకేసుల గ్రామ కూడలిలో కూటమి నాయకులు ఇటీవల ఎన్‌టిఆర్ విగ్రహాన్ని ఏర్పాటు చేసుకున్నారు. శనివారం ఆయన వర్ధంతి కావడంతో వారు ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి, ఘనంగా నివాళులర్పించారు.


ఎన్‌టిఆర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తునన ప్రజలు

సొసైటీ అభివృద్ధి చెందేనా..!

రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యం - మంజూరుకాని కాంప్లెక్స్ గదుల నిర్మాణ అనుమతులు

ప్రజాశక్తి - చాపాడు

అల్లాడుపల్లె రైతు సేవా సహకార సంఘం బ్యాంక్ అభివృద్ధి ఏళ్ల తరబడి కుంటుపడుతూనే ఉంది. ప్రభుత్వాలు, పాలకులు మారుతున్నా శిథిలావస్థలో ఉన్న సహకార సంఘం బ్యాంక్ అభివృద్ధిలోకి తీసుకు రాలేకపోతున్నారు. అల్లాడుపల్లె రైతు సహకార సంఘం లాభాల బాటలో నడుస్తుండడం, 40 సెంట్ల స్థలం ప్రధాన రహదారి వెంట అందుబాటులో ఉంది. శిథిలావస్థలో ఉన్న భవనం రూపురేఖలు మార్చడానికి నిధులు మంజూరైనా ప్రభుత్వ నిబంధనలకు అవసరమైన పత్రాలు లేకపోవడంతో అభివృద్ధి కుంటుపడుతున్నట్లు తెలుస్తోంది. గత ప్రభుత్వ హయాంలో గోదాము నిర్మాణం, కాంప్లెక్స్ గదుల నిర్మాణానికి డిసిసి బ్యాంక్ ఒక శాతం వడ్డీ రేటుతో రూ.కోటికిపైగా రుణం ఇచ్చేందుకు ముందుకు వచ్చింది. నూతన గదుల నిర్మాణానికి అవసరమైన మ్యాప్‌ను కూడా సిద్ధం చేశారు. డిసిసి బ్యాంక్ రుణం మంజూరు చేయాలంటే పంచాయతీ అనుమతులు కావాలని నిబంధన పెట్టింది. పంచాయతీ అనుమతుల కోసం సొసైటీ బ్యాంకు సిబ్బంది వెళ్లగా సొసైటీకి సంబంధించిన స్థలం ఆన్‌లైన్‌లో లేకపోవడంతో వన్ బి పెండింగ్‌లో ఉంది. రెవెన్యూ అధికారుల వద్దకు సమస్యను తీసుకుపోగా అల్లాడుపల్లె రైతు సేవా సహకార సంఘం బ్యాంకు ఆవరణానికి చెందిన భూమి సర్వే నెంబర్ 71/3లో ఉందని ఈ పొలం సొసైటీ పేరుతో కాకుండా మిగులు భూమి కింద రూ.2 కోట్ల ఖాతాలో ఉందని తెలిపారు. ఈ నేపథ్యంలో సొసైటీ పేరుతో ఉన్న రిజిస్టర్ పత్రాలు, ఇతర ఆధారాలతో గత ఏడాది నుంచి రెవెన్యూ వారిని సమస్యను పరిష్కరించాలని సొసైటీ సిబ్బంది కోరుతున్నారు. తహశీల్దార్ కార్యాలయం నుండి ఆర్‌డిఒ కార్యాలయానికి, అక్కడి నుండి జెసికి సంబంధిత పత్రాలను పంపినప్పటికీ నేటి వరకు సొసైటీ వన్ బి సమస్య పరిష్కారానికి నోచుకోలేదు. దీంతో అభివృద్ధి పనులు రోజురోజుకు కుంటు పడు తున్నాయి. డిసిసి బ్యాంకు సిబ్బంది పంచాయతీ అనుమతి ఇవ్వగానే రుణాన్ని అంది స్తామని చెబుతున్నా.. అందుకు అను గుణంగా రెవెన్యూ సిబ్బంది సమస్య పరిష్కరించడం లేదని సొసైటీ సిబ్బంది పేర్కొంటున్నారు. అల్లాడుపల్లె రైతు సేవా సహకార సంఘానికి సంబంధించిన స్థలం ఆన్‌లైన్ నమోదు చేసి వన్ బి మంజూరు చేస్తే 32 షాపింగ్ కాంప్లెక్స్ రూముల నిర్మా ణానికి అవకాశం ఉంటుంది. తద్వారా సొసైటీ అభివృద్ధికి మరింత చేదోడువాదోడుగా ఉం టుంది. నూతన ప్రభుత్వ వచ్చిన తర్వాత ఎన్ని కలు జరిగితే పాలకమండలి ఏర్పడుతుందని అం దరూ భావించారు. అయితే ఎన్నికలు జర గడం ఆలస్యమవుతోందని తెలుస్తుంది. ప్రభుత్వ ఆధ్వ ర్యం లో త్రిసభ్య కమిటీని ఏర్పాటు చేస్తారని సమాచారం. త్వరగా సభ్యు లను నియమించి సొసైటీ భూ మి ఆన్‌లైన్ సమ స్యను పరి ష్కరించి కాంప్లెక్స్ గదుల నిర్మాణానికి సహక రించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.


శిథిలావస్థలో రైతు సేవా సహకార సంఘం
కాంప్లెక్స్ గదులు ఏర్పాటు చేసేందుకు అనువైన స్థలం

ఎదుగుదలలేని నువ్వు పంట

ప్రజాశక్తి - సింహాద్రిపురం

మండలంలోని రావులకొలను గ్రామంలో నాసిరకం గడ్డి మందు కారణంగా నువ్వు పంట ఎదుగుదల లేదని రైతు మహేశ్వర్‌రెడ్డి ఆరోపిస్తున్నాడు. గత నెల 13న పులివెందులలోని ఓ ఎరువుల దుకాణంలో నువ్వులుతోపాటు గడ్డి మొలవకుండా మందులు కొనుగోలు చేశానని తెలిపాడు. నువ్వు విత్తిన అనంతరం సాయంత్రం గడ్డి మందు పిచికారి చేశామని, పంట ఎదుగుదల లేదని అంటున్నాడు. విషయాన్ని దుకాణ యాజమానికి తెలిపినప్పటికీ స్పందించడం లేదని రైతు ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. వ్యవసాయ శాఖ అధికారులు స్పందించి న్యాయం చేయాలని బాధిత రైతు కోరుతున్నాడు.



వైభవం.. శ్రీత్యాగరాజస్వామి గ్రామోత్సవం

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

సంగీత విద్వాంసుడు శ్రీత్యాగరాజస్వామి ఆరాధన సందర్భంగా శనివారం పట్టణంలో గ్రామోత్సవం వైభవంగా నిర్వహించారు. శనివారం నాయీ బ్రాహ్మణులు ప్రత్యేక పల్లకిని ఏర్పాటు చేసి అందులో త్యాగరాజస్వామి చిత్ర పటాన్ని ఉంచి, మంగళ వాయిద్యాలతో గ్రామోత్సవం నిర్వహించారు. స్థానిక తూర్పు ఆంజనేయస్వామి ఆలయం వరకు సాగింది. అనంతరం భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. ప్రతి ఏడాది శ్రీత్యాగరాజస్వామి ఆరాధన ఉత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నారు.


కార్యాలయ ఆవరణలో పిచ్చిమొక్కలు తొలగిస్తున్న తహశీల్దార్, సిబ్బంది

పరిసరాల శుభ్రత అందరి కర్తవ్యం

ప్రజాశక్తి - సింహాద్రిపురం

పరిసరాల పరిశుభ్రత అందరి కర్తవ్యమని తహశీల్దార్ నాగేశ్వంరావు సూచించారు. సింహాద్రిపురం రెవెన్యూ కార్యాలయ ఆవరణలో శనివారం స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో భాగంగా పిచ్చి మొక్కలు, చెత్తాచెదారం తొలగించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ పరిసరాలు శుభ్రంగా ఉంటే ఆరోగ్యంగా ఉంటామన్నారు. తమ ఇంటి పరిసరాల్లో పిచ్చి మొక్కలు, చెత్త చెదారం, నీరు నిల్వ ఉండకుండా ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. డిప్యూటీ తహశీల్దార్ శ్రీహరి బాబు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.


వేంపల్లెలో ర్యాలీ చేస్తున్న పంచాయతీ సిబ్బంది

మండలాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దాలి

ప్రజాశక్తి - వేంపల్లె

పారిశుధ్యాన్ని ప్రతి ఒక్కరూ పాటించి మండలాన్ని ఆదర్శంగా నిలిపేందుకు సహకరించాలని ఎంపిడిఒ కుళాయమ్మ పేర్కొన్నారు. వేంపల్లె పురవీధుల గుండా స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛదివస్ కార్యక్రమంలో భాగంగా శనివారం పారిశుధ్య, సచివాలయ సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ ప్రజలు తమ ప్రాంతాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ప్రతి గ్రామంలో పరిశుభ్రత అనేది ఉండాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తోందన్నారు. గ్రామంలోని కూడళ్లలో మానవహారం చేపట్టారు. కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి మల్లికార్జునరెడ్డి, పంచాయతీ కార్యదర్శి సుబ్బారెడ్డి, సచివాలయ కార్యదర్శులు కొండయ్య, వర ప్రసాద్‌రెడ్డి, వెంకట ప్రసాద్, పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.


డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న ఎంవిఐ ప్రసాద్

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

- ఎంవిఐ వెంకట ప్రసాద్

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

వాహనాలు నడిపేవారు రోడ్డు భద్రత నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపర చర్యలు తీసుకుంటామని ఎంవిఐ బి వెంకట ప్రసాద్ తెలిపారు. స్థానిక ఆర్‌టిఒ కార్యాలయంలో 36వ జాతీయ రహదారి భద్రత వారోత్సవాల సందర్భంగా శనివారం ఆటోడ్రైవర్లు, వాహన డ్రైవర్లకు నిబంధనలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మద్యం సేవించి, సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ వాహనాలను నడపకూడదన్నారు. రాష్ డ్రైవింగ్, అతివేగం ప్రమాదకరమన్నారు. పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించకూడదన్నారు.

శిల్పారామంలో నేడు సాంస్కృతిక కార్యక్రమాలు

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

శిల్పారామంలో ఆదివారం సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు శిల్పారామ పరిపాలన అధికారి సుధాకర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కోలా ప్రసాద్ వారి సహకారంతో మాష్టర్ కిషోర్, కిషోర్ డ్యాన్స్ అకాడమీ, కడప చిన్నారులచే జానపద, వెస్టర్న్ మొదలగు నృత్య ప్రదర్శనలు ఏర్పాటు చేశామన్నారు. పులివెందుల పట్టణ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాలను విజయవంతం చేయాలని ఆయన కోరారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

ప్రజాశక్తి - పులివెందుల టౌన్


మాట్లాడుతున్న ఎంపిడిఒ రామాంజనేయరెడ్డి

అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించడమే ప్రభుత్వ ధ్యేయమని ఎంపిడిఒ రామాంజనేయరెడ్డి తెలిపారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడుతూ అధికారులు సమయపాలన పాటించాలన్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందేలా చూడాలని అధికా రులను కోరారు. పట్టణ సిఐ నరసింహులు మాట్లాడుతూ సామాజిక మాధ్య మాల్లో అసభ్యకర పోస్టులు పెట్టే వారిని, అసాంఘిక కార్యక్రమాలు నిర్వహించే వారి సమాచారాన్ని మహిళ పోలీసులకు తెలియజేయాలన్నారు. సమావేశంలో ఎంపిపి వరలక్ష్మి, మండల ఉపాధ్యక్షుడు విశ్వనాథ్‌రెడ్డి, ఎంపిటిసిలు, సర్పం చులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

కుష్టు వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పించాలి

ప్రజాశక్తి - వేంపల్లె

కుష్టు వ్యాధి లక్షణాలపై ప్రజలకు అవగాహన కల్పించి, నిర్మూలనకు ఆరోగ్య సిబ్బంది కృషి చేయాలని వైద్యాధికారి స్వాతిసాయి పేర్కొన్నారు. తాళ్లపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శనివారం ఆరోగ్య సిబ్బందికి కుష్టు వ్యాధిపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కుష్టు వ్యాధి నిర్మూలన నిమిత్తం ఈనెల 20 నుంచి ఫిబ్రవరి 2వ తేదీ వరకు ఆరోగ్య సిబ్బంది ప్రతి ఇంటికి వెళ్లి స్పర్శ లేని మచ్చలు, పొడలను గుర్తించాలని సూచించారు. పొడలు, స్పర్శ లేని మచ్చలు ఉన్న వారిని ప్రభుత్వాసుపత్రికి పంపించి వైద్యం చేయించాలన్నారు. ప్రజలు కూడా ఆరోగ్య సిబ్బందికి సహకరించాలన్నారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ షఫీ ఉన్నిసా బేగం, సిహెచ్‌ఒ వెంకటరత్నం, ఎంపిహెచ్ఇఒ ఫక్రుద్దీన్, సూపర్‌వైజర్ వెంకటలక్ష్మి, అరుణదేవి, అంకయ్య, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



ఆరోగ్య సిబ్బందికి సూచనలిస్తున్న హెల్త్ ఎడ్యుకేటర్ షఫీ ఉన్నిసా


మాట్లాడుతున్న డివైఎఫ్ఐ నాయకులు విశ్వనాథ్

డ్వాక్రా మహిళలను దోచుకుంటున్న ఆర్‌పిలు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

డ్వాక్రా మహిళలు రుణాలు తీసుకున్నప్పుడల్లా ఆర్‌పిలు దోచుకు తింటున్నారని డివైఎఫ్ఐ కార్యదర్శి విశ్వనాథ్ ఆరోపించారు. స్థానిక కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ డ్వాక్రా రుణాలు ప్రభుత్వం నుంచి ప్రతి 20 నెలలకు ఒకసారి రెన్యువల్ చేసుకుంటారని, ఒక్కో గ్రూపునకు సంబంధించి పదిమంది సభ్యులు ఉంటారు. వారు 20 నెలల కాలంలో దాదాపు రూ.10 లక్షల నుంచి రూ.20 లక్షల వరకు రుణం తీసుకోగలుగుతారని, ఇందుకుగానూ రూ.లక్షకు ఆర్‌పిలు రూ.వెయ్యి చొప్పున వసూలు చేస్తున్నారని ఆరోపించారు. ఇలా వసూలు చేయడం దుర్మార్గమైన ఆలోచనగా పేర్కొన్నారు. ఇలాంటి వారిపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. దాదాపు ఈ మొత్తం రుణాలు 20 నెలల కాలంలో రూ.కోట్లల్లో లావాదేవీలు జరుగుతుందన్నారు. దీనికి 1శాతం చొప్పున వసూలు చేయడం లక్షల్లో ఉంటుందన్నారు. దీనిపై సమగ్ర విచారణ జరిపి అవినీతికి పాల్పడుతున్నారో వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆటో యూనియన్ నాయకులు పి.శేఖర్, ఎం.శ్రీనివాసులు పాల్గొన్నారు.

నేడు బిసి సంక్షేమ సంఘం ఆవిర్భావ సభ

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

జమ్మలమడుగు నియోజకవర్గ బిసి సంక్షేమ సంఘం ఆవిర్భావ సభను ఆదివారం స్థానిక చౌడేశ్వరి కల్యాణమండపంలో నిర్వహిస్తున్నామని అధ్యక్షులు చౌడం జొల్లు కొండయ్య తెలిపారు. ఆ మేరకు శనివారం చౌడేశ్వరి కల్యాణమండపంలో కొండయ్య, కార్యనిర్వాక అధ్యక్షులు కాటా రామదాసు మాట్లాడుతూ కార్యక్రమానికి జాతీయ బిసి సంఘం అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్, రాష్ట్ర అధ్యక్షులు కేశన శంకర్‌రావు, జిల్లా బిసి సంక్షేమ సంఘం అధ్యక్షులు బత్తల లింగమూర్తి, బిసి ప్రజా చైతన్య సమాఖ్య అధ్యక్షులు బొర్రా రామాంజనేయులు, రాష్ట్ర బిసి యువజన సంక్షేమ సంఘం అధ్యక్షులు కుమ్మరి క్రాంతి కుమార్ పాల్గొంటున్నారని తెలిపారు. జమ్మలమడుగు నియోజక వర్గంలోని బిసిలంతా కార్యక్రమానికి పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ప్రధాన కార్యదర్శి మేడికుర్తి జీవన్‌కుమార్, కోశాధికారి హెబ్బారే వెంకోబారావు, గౌరవ అధ్యక్షులు బడిగించల చంద్రమౌళి పాల్గొన్నారు.

పశువైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి - లింగాల

మండలంలో పశువుల కోసం ప్రత్యేకంగా నిర్వహిస్తున్న పశువైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని మండల పశువైద్యాధికారి మంగేష్ శనివారం ఒక ప్రకటనలో కోరారు. ఈనెల 20న ఇప్పట్ల, దొండ్లవాగు, 21న చిన్నకుడాల, కామసముద్రం, కమ్మవారిపల్లె, 22న రామట్లపల్లె, అక్కులుగారిపల్లె, తెర్నాంపల్లె, 23న గుణకణపల్లె, పెద్దకూడల, 24న మూరారిచింతల, దిగువపల్లె, బోనాల, 25న అంబకపల్లె, అంకేవానిపల్లె, 26న కోమన్నూతల, చెర్లోపల్లె, లింగాల, 27న వెలిదండ్ల, లోపట్నూతల, 28న తాతిరెడ్డిపల్లె, ఏగువ పల్లె, పార్నపల్లె, 29న కార్నపాపయ్యపల్లె, రామాపురం, ఇంటిఓబయ్యపల్లె గ్రామాల్లో పశు వైద్య శిబిరాలు నిర్వహిస్తామన్నారు. సన్న దూడలకు నట్టల నివారణ కార్యక్రమం, పశువులకు గర్భకోశ వ్యాధులకు చికిత్సలు చేయిస్తా మన్నారు. ఈ అవకాశాన్ని పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.



పరీక్ష రాసి వస్తున్న విద్యార్థులు

ప్రశాంతంగా ముగిసిన నవోదయ పరీక్ష

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

పట్టణంలో శనివారం నిర్వహించిన నవోదయ పరీక్ష ప్రశాంతంగా ముగిసిందని ఎంఇఒ చంద్రశేఖరరావు తెలిపారు. స్థానిక వెంకటప్ప మెమోరియల్ పాఠశాల, అహోబిలాపురం ప్రభుత్వ పాఠశాలలో నవోదయ పరీక్ష నిర్వహించామన్నారు. 418 మంది విద్యార్థులు హాజరయ్యారని తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద విద్యార్థులకు అవసరమైన అన్ని సదుపాయాలను కల్పించామన్నారు.


బీరం పాఠశాలను సందర్శించిన మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

'బీరం' పాఠశాలను సందర్శించిన మంత్రి

ఖాజీపేట : రవాణా, యువజన క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డిని శనివారం బీరం శ్రీధర్‌రెడ్డి పాఠశాల యాజమాన్యం ఘనంగా సన్మానించింది. మైదుకూరులో ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా ఆయన వెళుతున్నందున బీరం పాఠశాల ఆతిథ్యం ఏర్పా టు చేసింది. కరస్పాండెంట్ బీరం సుబ్బారెడ్డి, గ్రూప్ వన్ అధికారి శ్రీకాంత్‌రెడ్డి, అధ్యాపకులు మంత్రిని ఘనంగా సన్మానించారు. అనంతరం మంత్రి రాంప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ ఆహ్లాదకరమైన వాతావరణంలో విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తూ అగ్రగామి విద్యా సంస్థగా తీర్చిదిద్దడం అభినందనీయమని కొనియాడారు. రాష్ట్ర ప్రయివేట్ విద్యా సంస్థల జెఎసి కన్వీనర్ డాక్టర్ పాపిరెడ్డి మదన్‌మోహన్ రెడ్డి పాల్గొన్నారు.